

# అంగన్వాడీ కేంద్రంలో సామూహిక అక్షరాభ్యాసం

**శెనార్తి మీడియా, ఎల్బీనగర్:**

ప్రైవేట్ ప్రీ స్కూల్స్‌కు సమానంగా అంగన్వాడీ కేంద్రాలను అభివృద్ధి చేయాలని ప్రభుత్వం, అధికారులు కృషి చేస్తున్నారు. సామాజిక సమానత్వం ఉన్న వాతావరణం కల్పించేందుకు అంగన్వాడీ టీచర్లు పాటు పడుతున్నారు. ఈ క్రమంలో అంగన్వాడీల్లో కొత్తగా చేరిన పిల్లలకు సామూహిక అక్షరాభ్యాసం నిర్వహిస్తున్నారు. హయత్ నగర్ ప్రాజెక్టు పరిధిలోని ఎన్టీఆర్ నగర్, భరత్ నగర్ తదితర సెక్టార్లకు చెందిన విద్యార్థులకు ఘనంగా అక్షరాభ్యాస కార్యక్రమం జరిగింది. డీడబ్ల్యూఓ శ్రీలత ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పిల్లలు, వారి తల్లి దండ్రులు పాల్గొన్నారు. ఈ సందర్భం గా ఆమె మాట్లాడుతూ, మూడేళ్లు నిండిన పిల్లలను అంగన్వాడీలకు పంపాలని, వారికి ఆటపాటలతో కూడిన ప్రాథమిక విద్య అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో సీడీపీఓ రేణుక, ఎన్టీఆర్ నగర్ సూపర్ వైజర్ సావిత్రి, స్వాతి, పోషణ అభియాన్ బీసీఏ యాదగిరి, టీచర్లు డి. పుష్పలత, జె. సునీత, యం. గంగ, ఆశా వర్కర్లు హేమలత, వెంకటమ్మ, కమల, అంజమ్మ, హెల్పర్లు నాగమ్మ, కళ, స్పందన, స్థానిక బాలింతలు, మహిళలు పాల్గొన్నారు.

# సుదర్శన్ యాదవ్ కు అభినందనల వెల్లువ

**ఒకే వేదికపైకి చిన్ననాటి స్నేహితులను తీసుకొచ్చిన నవాబుపేట పాఠశాల పూర్వ విద్యార్థి**



**శెనార్తి మీడియా, చిగురుమామిడి:**

కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండలం నవాబుపేట గ్రామంలో 1999-2000 విద్యాసంవత్సరానికి చెందిన పదవ తరగతి పూర్వ విద్యార్థుల సిల్వర్ జూబ్లీ ఆత్మీయ సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దాదాపు 70 మంది పూర్వ విద్యార్థులను ఒక్కచోట చేర్చేందుకు హరివిల్లు ఇన్ఫ్రా డెవలపర్ మేనేజర్ సిద్దుల సుదర్శన్ యాదవ్ ఎంతో కృషి చేశారు. ఆయన స్వంత ఖర్చులతో దాదాపు 100 మందికి భోజన సదుపాయం, శాలువాలు, మెమెంటోలు ఏర్పాటు చేశారు. సుదర్శన్ యాదవ్ చేసిన ఈ కృషికి తోటి స్నేహితులు అభినందనలు తెలిపారు. ఇంతమంది స్నేహితులను ఒక్క వేదికపైకి తీసుకువచ్చిన సుదర్శన్‌కు కృతజ్ఞతలు తెలిపారు. అలాంటి మిత్రుడు తమకు ఉండడం అదృష్టంగా భావిస్తున్నట్టు తెలిపారు. ఈ సందర్భంగా సుదర్శన్‌ను సన్మానించి మెమెంటోను అందజేశారు. స్నేహితులందరి సహకా రంతో సిల్వర్ జూబ్లీ వేడుకలు విజయవంత మయ్యా యని, అందరికీ ధన్యవాదాలు తెలుపుతున్నట్టు సుదర్శన్ తెలిపారు



## అసిస్టెంట్ ప్రొఫెసర్‌కు గ్లోబల్ ఐకాన్ అవార్డు

**శెనార్తి మీడియా, సిద్దిపేట:** మిట్టపల్లి సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ డిగ్రీ గురుకుల కళాశాల ఇంగ్లీష్ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ కొర్వి వినాయకళ గ్లోబల్ ఐకాన్ ఎక్సలెంట్ అవార్డు–2025ను అందుకున్నారు. హైదరాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో మాజీ కేంద్ర మంత్రి డాక్టర్ వేణు గోపాల చారి, సీనియర్ జర్నలిస్ట్ శంకర్ నారాయణ చేతుల మీదుగా ఈ అవార్డు అందజేశారు. వినాయకళ ప్రస్తుతం ఇంగ్లీష్ అధ్యాపకురాలిగా సేవలందిస్తున్నారు. గతంలో తెలంగాణ సోషల్ వెల్ఫేర్ గురుకులాల్లో స్పెషల్ ఆఫీసర్ డిపార్ట్మెంట్ ఆఫ్ అలుమ్ని రిలేషన్స్‌గా బాధ్యతలు నిర్వ హించారు. బోధనలో నూతన విధానాలు అవలంబిస్తూ, గ్రామీణ ప్రాంతాల నుండి వచ్చే విద్యార్థినిలకు కేరియర్ గైడెన్స్ అందిస్తూ పలువురిని ఉన్నత స్థాయికి చేర్చారు. ఆమె చేస్తున్న సేవలను గుర్తించిన నిర్వాహకులు గ్లోబల్ ఐకాన్ అవార్డుతో సత్కరించారు. డాక్టర్ వినాయకళ అవార్డు అందుకోవడంపై కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సునీత, వైస్ ప్రిన్సిపాల్ వనజ, ఇతర అధ్యాపకులు హర్షం వ్యక్తం చేసి అభినందనలు తెలిపారు.

# కొనుగోలు కేంద్రాల్లో ప్యాడీ క్లీనర్లపై నిర్లక్ష్యం



**శెనార్తి మీడియా, మంచిర్యాల:**

మంచిర్యాల జిల్లా హాజీపూర్ మండలంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ప్యాడీ క్లీనర్లు నిర్లక్ష్యం శికారమవుతున్నాయి. రైతుల ధాన్యాన్ని శుభ్రపరచేందుకు పంపిన ప్యాడీ క్లీనర్లు, కొందరు నిర్వాహకుల అసమర్థత కారణంగా వర్షాలు తాకి తుప్పు పట్టి పనికిరాని స్థితికి చేరాయి.కొన్ని కేంద్రాల్లో వాడిన తర్వాత మళ్లీ మార్కెట్ కమిటీలకు అప్పగించకుండా బయటే వదిలిపెట్టడం వల్ల ఇవి నష్టపాలవుతున్నాయి. జిల్లాలో సుమారు వందకు పైగా ప్యాడీ క్లీనర్లు పంపిణీ చేసినప్పటికీ, వాటిలో 90 శాతానికి పైగా తిరిగి అప్పగించలేదని సమాచారం.పరికరాల్లో భాగమైన మోటార్లు దెబ్బతిన్నాయి. కొన్నింటిని చోరీ చేసిన ఘటనలూ జరిగాయి. మార్కెటింగ్ శాఖ వేలాది రూపాయల నష్టాన్ని భరించాల్సి వస్తోంది. ఈ నిర్లక్ష్యంపై రైతులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ప్రతి సీజన్‌లో ఉపయోగించాల్సిన పరికరాల నిర్వహణలో అలసత్వం చూపడం వల్ల ప్రభుత్వానికే నష్టం కలుగుతోందని వారు విమర్శిస్తున్నారు.పరిస్థితిపై స్పందించిన మార్కెటింగ్ శాఖ అధికారుల ప్రకటన:“అన్ని ఏజెన్సీలకు నోటీసులు జారీ చేశాము. ఈ నెల 30 లోగా ప్యాడీ క్లీనర్లు, మాయిశ్చర్ మీటర్లు, టార్పాలిన్ కవర్లు, కంట మెషిన్ లను సంబంధిత మార్కెట్ కమిటీలకు తిరిగి అప్పగించాలని ఆదేశించాం. ఇది పాటించని ఏజెన్సీలకు కమిషన్ నుండి కోత విధిస్తాం,” అని మార్కెటింగ్ ఏ డి శాబుద్దీన్ తెలిపారు.

# పబ్లిక్ ప్రాసిక్యూటర్లతో సమన్వయ సమావేశం

**శెనార్తి మీడియా, కరీంనగర్:**




కరీంనగర్ కమిషనరేట్ కేంద్రంలోని కాన్ఫరెన్స్ హాల్లో మంగళవారం పబ్లిక్ ప్రాసిక్యూటర్లతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి కరీంనగర్ పోలీస్ కమీషనర్ గౌస్ ఆలం ఐపీఎస్ నేతృత్వం వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గత శనివారం జాతీయ లోక్ అదాలత్ సందర్భంగా పోలీసు అధికారుల సహకారంతో 3478 కేసులను పరిష్కరించడంలో కీలక పాత్ర పోషించిన పబ్లిక్ ప్రాసిక్యూటర్లకు అభినందనలు తెలిపారు. కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్న కేసుల పరిష్కారానికి పోలీసు అధికారులతో సమన్వయం లోపిస్తే, అది తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. భవిష్యత్తులోనూ ఇదే విధంగా పరస్పర సహకారంతో కేసులు త్వరగా పరిష్కారమయ్యేలా చర్యలు తీసుకోవాలని ప్రాసిక్యూటర్లను కోరారు. రానున్న అర్ధ వార్షిక నేర సమీక్ష సమావేశంలో వారు భాగస్వాములై, పోలీసులకు ఉన్న సందేహాలను నివృత్తి చేయాలన్నారు. ఈ సమావేశంలో అడిషనల్ డీసీపీ వెంకటరమణ, సీసీఆర్బి ఏసీపీ జి.విజయ్ కుమార్, డిప్యూటీ డైరెక్టర్ ఫర్ ప్రాసిక్యూషన్ డి.శరత్, పబ్లిక్ ప్రాసిక్యూటర్ జె.శ్రీరాములు, అడిషనల్ పీపీలు ఏ.రాములు, గౌరు రాజిరెడ్డి, పి.కుమారస్వామి, కె.జాన్సీ, ఏపీపీలు గాయత్రి, జి.వీరాస్వామి, ఏ.రంజిత్ కుమార్, ఇన్‌స్పెక్టర్ సంతోష్ కుమార్ తదితర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.






# కుప్పంలో ఓ మహిళ పట్ల అమానుషం

- బాకీ వసూలు కోసం చెట్టుకు కట్టేసి హింస
- ఘటనపై ముఖ్యమంత్రి చంద్రబాబు ఆగ్రహం
- ఎస్పీకి కఠిన ఆదేశాలు



**అమరావతి, జూన్ 17 :**

కుప్పం మండలంలో అప్పు తీర్చలేదని ఓ మహిళను చెట్టుకు కట్టేసిన దారుణ ఘటన రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర సంచలనం రేపింది. స్వయంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గంలోనే ఈ అమానుషం జరగడం తీవ్ర స్థాయిలో చర్చనీయాంశమైంది.నారాయణపురం గ్రామంలో మునికన్నప్ప అనే వ్యక్తి, అప్పు ఇచ్చినందుకు బాకీ వసూలు కోసం, తిమ్మరాయప్ప భార్య శిరీషను చెట్టుకు కట్టేసి హింసించాడు. ఈ దారుణం మంగళవారం పత్రికలో వెలుగులోకి వచ్చింది. వెంటనే స్పందించిన ముఖ్యమంత్రి జిల్లా పోలీసు కమిషనర్‌ను సంప్రదించి వివరాలు తెలుసుకున్నారు.ఈ ఘటనపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసిన సీఎం, నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉండాలని, వారికి సంబంధించిన పూర్తి వివరాలను కలెక్టర్ అందజేయాలని చెప్పారు. అప్పు కారణాలు ఏంటన్న దానిపై నివేదిక తీసుకురావాలని కూడా సూచించారు.మూడేళ్ల క్రితం శిరీష భర్త తిమ్మరాయప్ప మునికన్నప్ప వద్ద రూ.80 వేల అప్పు తీసుకున్నాడు. ఆ తర్వాత కుటుంబాన్ని వదిలేసి ఎక్కడికో వెళ్లిపోయాడు. అప్పటి నుండి శిరీష కూలిపనులు చేస్తూ పిల్లలను పోషిస్తోంది. అప్పు తీర్చలేకపోవడంతో ఆమెను చెట్టుకు కట్టి హింసించారు. విషయం తెలిసిన పోలీసులు మునికన్నప్ప కుటుంబంపై కేసు నమోదు చేశారు.ఈ ఘటనపై ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల స్పందిస్తూ, ఇది సభ్య సమాజం తల దించుకునే ఘటన అని అన్నారు. తల్లిని తన కొడుకు ముందే అవమానించడం దారుణమని, మహిళగా తాను ఈ ఘటనను తీవ్రంగా ఖండిస్తున్నానని తెలిపారు. బాధిత కుటుంబానికి న్యాయం జరగాలని, ఈ అమానవీయ ఘటన భవిష్యత్తులో పునరావృతం కాకుండా చూడాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

# నేరాలపై కఠిన చర్యలు తీసుకోవాలి

**కామారెడ్డి, జూన్ 17:** నేరాలపై కట్టుదిట్టు చర్యలు తీసుకోవాలని జిల్లా ఎస్పీ రాజేష్ చంద్ర అన్నారు. మంగళవారం జిల్లా ఎస్పీ కార్యాలయంలో పోలీస్ అధికారుల తో నెలవారీ నేర సమీక్షా సమావేశం నిర్వ హించారు.ఈ సందర్భంగా పెండింగ్‌లో ఉన్న కేసులపై డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలతో సమీక్షించారు. ముఖ్యంగా గ్రేవ్ కేసుల్లో ఎస్ఓపీ పాటిస్తూ త్వరిత దర్యాప్తు పూర్తి చేయాలని సూచించారు. పోలీస్ స్టేషన్లకు వచ్చే ప్రతి ఫిర్యాదుదారుని గౌరవంగా తీసుకోవాలని, సమస్య పరిష్కారానికి కృషి చేయాలని అధికారులను ఆదేశించారు.సైబర్ మోసాల నుంచి ప్రజలను రక్షించేందుకు అవగాహన కార్యక్రమాలు గ్రామ స్థాయిలో నిర్వహించాలని, హిస్టరీషీటర్లపై నిఘా పెంచాలని, బీట్ వ్యవస్థను పటిష్ఠం చేయాలని తెలిపారు. వర్షాల నేపథ్యంలో సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు. డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిరంతరం నిర్వహించాలని స్పష్టం చేశారు.ఈ సమావేశంలో అదనపు ఎస్పీ నరసింహారెడ్డి, ఏఎస్పీ చైతన్య రెడ్డి, డీఎస్పీలు శ్రీనివాస్ రావు, విఠల్ రెడ్డి, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ తిరుపయ్య, సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

# సీఆర్ఆర్ నిధులతో అభివృద్ధి పనులకు శంకుస్థాపన





**శెనార్తి మీడియా, పెద్దవంగర :**

మహబూబాబాద్ జిల్లా పెద్దవంగర మండల పరిధిలోని కాన్వాయిగూడెం, కోరిపెల్లి, వడ్డేకోతపల్లి గ్రామాల్లో సిఆర్ఆర్ నిధులతో చేపట్టనున్న సీసీ రోడ్లు, డ్రైనేజీ నిర్మాణ పనులకు పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని రెడ్డి భూమిపూజ చేసి పనులను ప్రారంభించారు. కాన్వాయిగూడెం గ్రామానికి ₹5 లక్షలు, కోరిపెల్లి గ్రామానికి ₹17 లక్షలు, వడ్డేకోతపల్లి గ్రామానికి ₹13 లక్షలు మంజూరయ్యాయి. ఈ నిధులతో గ్రామాల్లో రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థలు మెరుగుపర్చనున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే యశస్విని రెడ్డి మాట్లాడుతూ, “గ్రామాల అభివృద్ధి ప్రకటనల్లో కాకుండా పనుల్లో కనిపించాలి. గ్రామస్తులకు శుభ్రమైన డ్రైనేజీలు, మంచిరహదారులు అందించడమే మా లక్ష్యం. అందుకే నిధులు మంజూరైన వెంటనే అధికారులతో చర్చించి పనులు ప్రారంభించాం”అని అన్నారు. ప్రతి గ్రామానికి అవసరమైన మేరకు నిధులు కేటాయించాలని కృషి చేస్తున్నామని, పనులు నాణ్యతతో పూర్తవ్వాలని సంబం ధిత శాఖల అధికారులను సూచించామని తెలిపారు. అభివృద్ధి పనుల ద్వారా గ్రామాల్లో మౌలిక వసతులు మెరుగవుతాయని, ఇది ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే పేర్కొన్నారు కార్యక్రమాల్లో స్థానిక ప్రజాప్రతినిధులు, గ్రామ నాయకులు, అధికారులు, గ్రామస్తులు పాల్గొన్నారు. అభివృద్ధి పనులు ప్రారంభమవుతుండటంపై ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.



